# చోటు

## ముదిగొండ శివకౌముదీ దేవి

మనుష్యుల ఎల్లాకాలం ఒకేవిధంగా ఉండరు. ఇది అందరికీ తెలిసిన సంగతే.

కాని ఒక్కో మనిషి వ్యక్తిత్వం మీద మనకి ఒక విధమైన విశ్వాసం ఉంటుంది. వారి ప్రవర్తన ఆధారంగా అది ఏర్పడుతుంది. కాని ఒక్కొక్కసారి వారి ప్రవర్తన, భావాలు మారిపోయి, వారిలో దాగి ఉన్న మరో వ్యక్తిత్వం బయటపడినపుడు మనికి షాక్ తగలడమూ సహజమే.

రాఘవ మాటలు వింటే నాకూ అట్లాగే షాక్ తగిలింది. మతి భ్రమించినట్లు అయింది.

"ఇది నా ఇల్లు, నా కష్టార్జితంతో, స్వేదంతో నిర్మిస్తున్న నా కలల సౌధం. ఇందులో శాంతి ఉండాలి. సంతోషం ఉండాలి. పూర్ణత్వం ఉండాలి. ఆరోగ్యం ఉండాలి. వికాసం ఉండాలి. ఆదర్శం ఉండాలి. ఇది నా పిల్లల కోసం నేను నిర్మిస్తున్న స్వర్గం. ఇందులో అన్నీ పాజిటివ్ అంశాలే ఉండాలి. అనారోగ్యం, రోగులు ఇక్కడ ఉండకూడదు.

ముఖ్యంగా అశాంతి, అలజడి, ఇటువంటివి నేను సహించను. మానసిక రోగులైన నీ పేరెంట్స్‌ని నా దగ్గర ఉంచుకోలేను."

ఇదీ అతను చెప్పింది.

నాకెంతో విచారం కలిగింది. ఇదేనా రాఘవ నుండి నేను ఆశించింది. అందరి వలే రాఘవ పెళ్లికి ముందు ప్రేమించుకునే రోజుల్లో" నీ కష్టసుఖాలు నావి" అని ప్రామిస్ చేసినవాడే.

తేరే దుఖ్ అచ్ మేరే

మేరే సుఖ్ అచ్ తేరే" అంటూ గైడ్ సినిమాలో రఫీ పాట వల్లించినవాడే, కాని అచ్చం గైడ్‌లో ఆ హీరో వలెనే ఇతనికీ బాధ్యతా రాహిత్యం ఉందా? ఇది బాధ్యతా రాహిత్యం కాదేమో. స్వార్థం కావచ్చును.

సందర్భం వచ్చినప్పుడేగా మనిషి అసలు స్వరూపం బయటపడేదీ. కాని రాఘవ ఇట్లా అంటాడనుకోలేదు.

ఎంత కచ్చితంగా, ఎంత నిక్కచ్చిగా చెప్పాడు " ఈ ఇల్లు నాది. నేను నా ముప్పై ఆరేళ్ల జీవితం అంతా కుటుంబ బాధ్యతలు మోసి, భరించి, భరించి అలసిపోయాను. ఇవాళ నేను ఇల్లు కడుతున్నానంటే అది శాంతికోసం. అది ప్రశాంతంగా ఉండే ఒక పూలతోట వలే ఉంటాలి. అంతేగాని మానసిక రోగులతో మెంటల్ హాస్పిటల్ కాకూడదు. ఇది నా ఇల్లు ఇందులో సగం డబ్బు ఖర్చు పెట్టి ఈ ఇంట్లో సగభాగం సాధించుకుని నీ పేషెంట్స్‌ని తెచ్చి ఇక్కడ పెడితే సహించలేను. ఈ ఇంట్లో సగభాగం నీకు నేను ఇవ్వను. రాఘవ తన స్వంత డబ్బుతో ఇంత బాగా ఇల్లు కట్టాడని అంతా అనుకోవాలి. ఇందులో సగం ఖర్చు జానకి ఇచ్చిందని అంతా అనుకుంటే నాకు నచ్చదు." అన్నాడు.

ఇంకా అన్నాడు "జానకీ! నేను నిన్ను పెళ్లి చేసుకున్నాను. నువ్వు నా భార్యవి. నా పిల్లలకి తల్లివి. నా జీవితంలో సగపాలు నువ్వు పంచుకున్నావు. నీ గౌరవ స్థానం నీదే.

కాని నేను కట్టే ఇంట్లో సగభాగానికి నీ డబ్బు తీసుకుని, నా ఇంట్లో సగం వాటా నీకు ఇవ్వలేను. ఆ విధంగా ఇంటి మీద హక్కు, అధికారం నీకు కల్పించి, నువ్వు నీ పేరెంట్స్‌ని తెచ్చి ఇంట్లో పెడితే నేను సహించలేను" అన్నాడు.

అంతే కాదు " నువ్వు పూర్తిగా నాకే చెందాలి. జానకీ- నీ అస్తిత్వం, నీ కళలు, నీ సంతోషం, నీ భావాలు, నీ జీవితం నాకే చెందాలి.


నాకూ- నా పిల్లలకే. మనం నలుగురమే ఉండే ఈ ఇల్లునే నేను ఊహించుకుంటున్నాను.

మానసిక రోగులతో కూడిన హాస్పిటల్‌ని కాదు-" అన్నాడు.

తన దృక్పథం తను చెప్పాడే తప్ప నా దృష్టి ఎందుకు గ్రహించడు? గ్రహించినా, గ్రహించనట్లు ఉంటాడేమో!

తనకి మనశ్శాంతి కావాలి. ప్రశాంతమైన, సౌకర్యవంతమైన, విశాలమైన ఇల్లు కావాలి. ఇంటి ముందు చక్కని పూలతోట, ఇంట్లో తనకి శాంతినిస్తూ అన్నీ అమర్చివెడుతూ నేనూ ముచ్చట గొలిపే కూతుళ్లు హిమ, లక్ష్మి. వారి ముద్దుమాటలు చిలిపి చేష్టలు చదువు సంధ్యలు ఉండాలి.

అతని తల్లిదండ్రులు, ఇంకా జీవితంలో స్థిరపడని, చదువుకుంటున్న తమ్ముళ్లూ, చెల్లెలూ, వాళ్లు వేరే ఉంటారు. ఇతను ఇప్పటి వరకూ తను కొనుకున్న ఫ్లాట్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఇండిపెండెంట్ హౌస్ కడుతున్నాడు. ఆ ఇంట్లో



మానసిక రోగులైన నా తల్లిదండ్రులకి స్థానంలేదు, నా డబ్బు తీసుకుంటే నేను ఇంట్లో నాకు వాటా ఉందని అంటాను. వాటా ఉంది కాబట్టి నా పేరెంట్స్‌ని తెచ్చి ఇంట్లో ఉంచుతానని భయం. కాబట్టి నా డబ్బు తీసుకోడు.

పోనీ మన పక్కింట్లో ఉంచుకుందాం అన్నాను." ప్రక్కన నేను చిన్న ఇల్లు కడతాను, నా పేరెంట్స్ కోసం అన్నాను.

అదీ వద్దుట. ఇంటి ప్రక్కనే మానసిక రోగులు ఉంటే తన పిల్లలు లేత మనసుల మీద వారి ప్రభావం పడుతుందిట. అందువల్ల నీ తల్లిదండ్రులు నా ఇంటి ప్రక్కన వద్దు-" అన్నాడు. ఎంత స్వార్థం?

కనీసం నీ తల్లిదండ్రులు ఆరోగ్యంగానే ఉండేవారు కదా, ఎందుకు అకస్మాత్తుగా వారికి మానసిక అనారోగ్యం వచ్చింది. ఏమైంది? ఏమిటి కంప్లయింట్? అని కూడ అడగలేదు. అతనికి నా కుటుంబం మీద అంత నిరాసక్తి ఉన్నది.

నాన్నగారు నారాయణమూర్తి సెంట్రల్ గవర్నమెంట్లో ఆఫీసర్. అమ్మ లలితాంబ టీచర్‌గా చేసేది.

నాన్నగారికి నేను ఒక్కదాన్నే సంతానం. తనకున్నదంతా పెట్టి నన్ను చదివించారు.

నేను సైకాలజీలో డాక్టరేట్ చేసి ఒక కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను. ఆరేళ్ల క్రితం నాన్న గుజరాత్‌లో పని చేస్తున్నారు. అప్పుడు జరిగిన ఘోరాలు-క్రూరాతి క్రూరమైన హింస- ఆ రక్తపాతం ఆ పర్వర్టెడ్ ఏక్టివిటీస్ ఆ మతకలహాల ఫలితంగా జరిగిన హింస ఒక మతం వారిని మరొకరు హింసించడం దహన కాండ

అదంతా చూసి నాన్న కలత చెందారు. అమ్మ కూడ, వారి మనసులు అడకత్తెరలో పోకచెక్కవలే హింస పడి నలిగి పోయాయి. ఆ హింస ప్రభావంతో వారికి మానసిక అనారోగ్యం వచ్చింది. ఆ కలలే రావడం డిప్రెషన్ ఇదీ వారిద్దరి సమస్య.

వారి హింస పడిన ఆత్మలకు, చిత్రహింసలు చూసి గాయపడిన మనస్సులకు స్వాంతన కావాలి. ప్రశాంతత చేకూరాలి. రిటైర్ అయ్యారు తర్వాత. డాక్టర్‌కి చూపించుకుంటూనే ఉన్నారు ఇద్దరూ. అయినా అలసట విసుగు.

ఆ మానవతా రాహిత్యం, ఆ దుర్మార్గం, దుష్టత్వం జ్ఞాపకం వచ్చి ఇప్పటికీ కలతగానే ఉన్నారు. వారి జీవితమంతా కష్టపడ్డారు. ఉన్నదంతా నా కోసమే నా చదువు, నా లలిత కళాభ్యాసం వీటి కోసమే ఖర్చు చేసారు. నేను సైకాలజీ డిపార్ట్‌మెంట్లో లెక్చరర్‌ని. చిత్రకారిణిని. సంగీతమూ నేర్చుకున్నాను.

దానంతటికీ ఎంతో ఖర్చు చేసారు. నాన్న పెద్దగా ఆస్తిపాస్తులు కలవాళ్లం కాదు. ఇవాళ ముసలితనంలో నాన్నకి, అమ్మకి ఆరోగ్యం బాగాలేక పోతే నేను వాళ్లకేం చేయవద్దా?


ఒకవేళ రాఘవ ఇన్నాళ్లుగా మేం నలుగురమే కలిసి ఉంటామని ఊహించుకున్నాడేమో సడన్‌గా ఇట్లా నా తల్లిదండ్రులు-మానసిక అనారోగ్యంతో ఉన్నవాళ్లు వచ్చి మాతో ఉంటారంటే, అతనికి ఆ కొత్త ఆలోచన జీర్ణం కాలేదేమో! నచ్చలేదేమో అన్నాను.

అంటే నీ సైకాలజీ పరిజ్ఞానం అంతా నా మీద ప్రయోగించకు" అన్నాడు.

పిల్లల డాక్టరు బాగానే సంపాదిస్తున్నాడు.

ఇల్లు కడుతున్నాడు. అందులో నా వాళ్లకి చోటు లేదు.

పితృస్వామ్య వ్యవస్థ స్వభావం అతనిలో ఉందేమో అనుకుంటే


కథా నిలయం శ్రీకాకుళం

కూతుళ్లని బాగానే చూస్తాడు కదా! కొడుకులు అక్కర్లేదనీ అన్నాడు.

ఇంత మానవతా రాహిత్యం ఈ మనిషిలో నేను సహించలేక పోతున్నాను. ఇంత స్వార్థపరుణ్ణా నేను వలచిందీ అని బాధ పడుతున్నాను.

000

నా అస్తిత్వానికి కారణం అయిన వారిని నేను రక్షించుకోవాలి. తల్లిదండ్రులకి పనికిరాని జన్మ వ్యర్థం. వారు నాకు ఏమీ చేయపోయినా నేను వారిపట్ల బాధ్యత నిర్వర్తించాలి. కూతురుగా అది నా ధర్మం. అటువంటిది వారు నన్నెంతో తీర్చి దిద్దారు. తమ సర్వస్వం నాకే ఇచ్చారు.

ఇవాళ లోకం మెచ్చుకునే నా ఆత్మ-ఈ చదువు-ఈ తెలివి-వారి పట్ల నా కర్తవ్యాన్ని విస్మరించలేను నా అస్తిత్వ మూలాలను అగౌరవ పరచలేను.

అస్తిత్వ మూలలను గుర్తించి గౌరవించలేని మనిషి బ్రతుకు వ్యర్థం ప్రక్కఇంట్లో నా తల్లిదండ్రులు ఉండటం కూడ పనికిరాని నీ జీవితంలో నేను ఉండలేను. అటువంటి నాతో కలిసి ఉండలేను. నీకు భార్యగా, నీ పిల్లలకి తల్లిగా నా సేవలు నీ కెంతో అవసరం. . కాని ప్రస్తుతం నా సేవలు నా తల్లిదండ్రులకే అవసరం.

నా ఉనికిని కారణం అయిన వారిని నేను విస్మరించలేను. నేను వారి దగ్గరే ఉంటాను. నీతో కలిసి ఉండలేను. నా తల్లిదండ్రులకి చోటు లేనిది నీ ఇంట్లో కాదు రాఘవా, నీ మనస్సులో. మనసులో చోటుంటే ఇంట్లోనూ ఉండేది" అంటూ ఉత్తరం పూర్తిచేసి టేబుల్‌పై అతను రాగానే కనిపించేటట్లు పెట్టాను. దాని మీద బరువు కోసం ఫ్లవర్ వాజ్ పెట్టాను. ఇల్లు తాళం వేసి అమ్మ, నాన్నల దగ్గరికి బయల్దేరాను. ఫ్లవర్‌వాజ్‌లో గర్బరా పూల పసుపు రంగులోని కాంతి నన్ను భవిష్యత్ వైపు ఆశగా నడిపించింది.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఏ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో**
**ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**